


కెరటం నా ఆదర్శం
లేచి పడుతున్నందుకు కాదు,
పడినా లేస్తున్నందుకు...


Dr.PRK

# పవర్

పోరాడితే పోయిదేమీ లేదు బానిస సంకెళ్ళు తప్ప



రామకృష్ణ హాస్పిటల్స్

పక్షవాతం, డిస్క్ సమస్యలు,
నడుమునొప్పి
మెడ నొప్పులకు
పూర్తి చికిత్స కలదు.
నిరుపేదలకు ఉచిత వైద్యం



రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్
విజయ టాకీస్ దగ్గర, హనుమాన్ టెంపుల్ లైన్, హనుమకొండ
సెల్:9849485100



సంపుటి : 01 సంచిక : 349 | ఆదివారం 27 సెప్టెంబర్ 2026 | పేజీలు : 4 | వెల : 4





## వ్యక్తిగత హాజరు
# అవసరం లేదు!

**సర్ నోటీసులపై ఈసీ కీలక ప్రకటన**

**అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత హాజరు అవసరం లేదు**

**కొత్త ఓటర్లు నిరంతర నమోదు ప్రక్రియ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు**

**20 రాష్ట్రాల్లో ఇప్పటికే ఓటరు జాబితా సవరణ పూర్తి**

**ఫారం-6 డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించిందని వెల్లడి**

**న్యూఢిల్లీ, పవర్ న్యూస్**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక ఊరటనిచ్చింది. ఓటర్లు వ్యక్తిగత విచారణకు హాజరు కావాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. బీఎల్వోలే ఓటర్ల ఇంటికి వచ్చి అవసరమైన డాక్యుమెంట్లను తీసుకుంటారని వివరించింది. ఈ మేరకు శనివారం ఢిల్లీలో కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషి సమావేశమై పలు అంశాలపై స్పష్టతనిచ్చారు. సవరణ ప్రక్రియలో భాగంగా ఫారం-6కు జతపరిచే డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని ఈ సందర్భంగా ఈసీ గుర్తుచేసింది. బీహార్, పశ్చిమ బెంగాల్‌తో సహా ఇప్పటికే 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తయిందని ఎన్నికల సంఘం వెల్లడించింది. జాబితాలో పేర్లు లేని వారు, యువత, తొలిసారి ఓటు హక్కు పొందిన వారు నిరంతర నమోదు ప్రక్రియ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని సూచించింది. ఇందుకోసం సంబంధిత నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిని (ఇు=ూ) సంప్రదించాలని, త్వరలో ప్రత్యేక నమోదు కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని పేర్కొంది. ఇటీవల గోవాలో 97 మంది అర్హులైన ఓటర్ల పేర్లు తుది జాబితాలో గల్లంతైన ఉదంతంపై ఈసీ స్పందిస్తూ,

..మిగతా 2లో

## హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో
# మన్మోహన్‌సింగ్ విగ్రహం ఏర్పాటు

**విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి**

**భారతరత్న ఇవ్వకపోవటం శోచనీయమని ఆవేదన**



**హైదరాబాద్, పవర్ న్యూస్**

హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని విప్రో సర్కిల్‌లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వకపోవటం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. పరిపాలనలో మన్మోహన్‌సింగ్ తీసుకున్న నిర్ణయాలు చాలా గొప్పవన్న సీఎం రేవంత్‌రెడ్డి భారతదేశం గర్వించదగిన జాతిరత్నం డాక్టర్ మన్మోహన్‌సింగ్ అని కొనియాడారు. మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వకపోవటం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లోని విప్రో సర్కిల్ లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. మన్మోహన్‌సింగ్ స్మారక పార్క్ ఏర్పాటు చేశారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా

..మిగతా 2లో

# బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

## బాకీ మల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ

**(నల్లగొండ -- పవర్, సెప్టెంబర్ 26)**

నల్లగొండ జిల్లా కాకులకొండారం గ్రామానికి చెందిన బాకీ మల్లయ్య ఇటీవల మృతి చెందారు ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్ మాదిగతో కలిసి శుక్రవారం మల్లయ్య నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళు లర్పించారు అనంతరం మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర కార్యదర్శి బాకీ నర్సింహా మాదిగ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు ఈ విషాద సమయంలో బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని రామకృష్ణ భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కావ్వంపెల్లి రవి మాదిగ, రాష్ట్ర ముఖ్య నాయకులు సప్పి పోచన్న తదితరులు పాల్గొన్నారు






## పాకిస్థాన్‌లో
# ఆత్మాహుతి దాడి

**11 మంది మృతి**

**పాకిస్థాన్‌లో పోలీసు చెక్‌పోస్ట్‌పై ఆత్మాహుతి దాడి**

**ఈ ఘటనలో 11 మంది మృతి, 30 మందికి గాయాలు**

**పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వెల్లడి**

**దాడికి బాధ్యత ప్రకటించుకున్న తెహ్రీక్-ఇ-తాలిబన్**

**న్యూఢిల్లీ, పవర్ న్యూస్**

పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు మరోసారి మారణహోమం సృష్టించారు. వాయవ్య పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో శనివారం చోటుచేసుకున్న ఆత్మాహుతి దాడిలో కనీసం 11 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. డేరా ఇస్మాయిల్ ఖాన్ జిల్లాలోని ఒక రహదారి పక్కన ఉన్న పోలీసు చెక్‌పోస్ట్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగింది. పేలుడు పదార్థాలతో నింపిన వాహనంతో వచ్చిన ఆత్మాహుతి బాంబర్, చెక్‌పోస్ట్ సమీపంలోకి రాగానే తనను తాను పేల్చుకున్నాడు. ఈ పేలుడు ధాటికి ఆ ప్రాంతం ఒక్కసారిగా దద్దరిల్లింది. ఈ ఘటనలో భారీ స్థాయిలో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఈ ఘాతుకానికి తమదే బాధ్యతని పాకిస్థానీ తాలిబన్‌గా పిలిచే తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ప్రకటించింది. ఇటీవలి కాలంలో పాకిస్థాన్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు గణనీయంగా పెరిగాయి. ప్రధానంగా టీటీపీ, బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) వంటి వేర్పాటువాద సంస్థలు వరుస దాడులకు పాల్పడుతున్నాయి. ఈ తాజా ఘటనతో దేశంలోని భద్రతా వ్యవస్థలోని లోపాలపై మరోసారి తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు
# రంగం సిద్ధం



**నవంబర్ రెండో వారం నుంచి పనులు ప్రారంభం**

**2027 వర్షాకాలం నాటికి పూర్తి చేయాలని లక్ష్యం**

**అక్టోబర్ 5న సీడబ్ల్యూసీకి డిజైన్లు సమర్పించనున్న అధికారులు**

**భద్రత, నాణ్యతలో రాజీ లేదన్న మంత్రి ఉత్తమ్**

2లో..

## నైరుతి రుతుపవనాల
# సీజన్ ముగిసింది

**లోటు వానలతో సమాప్తం**

**చివరలో కొంతమేర ఆదుకున్న వాయుగుండం**

**నేటి నుండి అక్టోబర్ రెండు వరకు మళ్ళీ వేడి గాలులు**

2లో..



# ముచ్చటగా మూడోసారి రెడ్ క్రాస్ ఛైర్మన్‌గా డా. పెసరు విజయచందర్ రెడ్డి

## హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్‌గా ఏకగ్రీవ ఎన్నిక

(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 26)



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ జిల్లా శాఖ ఛైర్మన్‌గా ప్రముఖ వైద్యులు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి ముచ్చటగా మూడోసారి ఎన్నికయ్యారు. రెడ్ క్రాస్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా 19 మంది నామినేషన్లు దాఖలు చేయగా, నలుగురు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో మిగిలిన 15 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన మేనేజింగ్ కమిటీ సభ్యులు తమలోని పదవులను ఎన్నుకోగా, ఛైర్మన్‌గా డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, వైస్ ఛైర్మన్‌గా పెద్ది వెంకట్ నారాయణ్ రెడ్డి, రాష్ట్ర పాలక మండలి సభ్యులుగా ఈ.వి. శ్రీనివాస్ రావు, కోశాధికారిగా బి. పాపి రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ, తనపై విశ్వాసంతో వరుసగా మూడోసారి ఛైర్మన్‌గా బాధ్యతలు అప్పగించిన మేనేజింగ్ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. రెడ్ క్రాస్ ద్వారా కొనసాగుతున్న మానవతా సేవలను మరింత విస్తృతం చేసి, అవసరమైన ప్రతి ఒక్కరికీ సేవలు అందేలా నూతన పాలకవర్గంతో కలిసి కృషి చేస్తానని తెలిపారు. రక్తదాన శిబిరాలు, ఆరోగ్య సేవలు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్‌ను మరింత సేవా దృక్పథంతో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని అన్నారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ చాప్టర్ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా ప్రసాద్ వాజ్‌పేయ్ ఘన విజయం

(వరంగల్ - పవర్,సెప్టెంబర్ 26):



భారత రెడ్ క్రాస్ సంస్థ (ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ) వరంగల్ జిల్లా చాప్టర్ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా (ఎంసీ) ప్రసాద్ వాజ్‌పేయ్ (ఎం.కాం, ఎంబీఏ) ఘన విజయం సాధించారు. సమాజంలో నిస్వార్థంగా సేవలందిస్తూ, మానవతా దృక్పథంతో ముందుకు సాగుతున్న ఆయన ఎన్నిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

**సేవా కార్యక్రమాలకు దక్కిన గుర్తింపు:**

ప్రసాద్ వాజ్‌పేయ్ అంకితభావానికి, సేవా మనస్తత్వానికి ఈ ఎన్నిక నిదర్శనమని పలువురు ప్రముఖులు కొనియాడారు. భవిష్యత్తులోనూ సమాజ సంక్షేమం కోసం, మానవతా విలువలను కాపాడుతూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ఆయన మరింత ఉత్సాహంగా సేవా కార్యక్రమాలు అందించాలని ఆకాంక్షించారు. ఈ శుభసందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

### హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో

# మన్మోహన్‌సింగ్ విగ్రహం ఏర్పాటు

**మొదటి పేజీ తరువాయి...**



ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. మన్మోహన్‌సింగ్ జీవితం జెన్‌జీ సహా అన్ని తరాలకు ఒక స్ఫూర్తి అని సీఎం తెలిపారు. మారుమూల గ్రామం నుంచి ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ వరకు మన్మోహన్‌సింగ్ విద్యాభ్యాసం సాగిందని, తన చదువు, విజ్ఞానం అంతా దేశానికే ఉపయోగపడాలని భావించి భారత్‌కు తిరిగివచ్చారని గుర్తు చేశారు. మన్మోహన్‌సింగ్, పీవీ నర్సింహారావు ఆలోచనల ఫలితమే సరళీకృత ఆర్థిక విధానమని, ఆనాడు ఇద్దరూ కలిసి తీసుకున్న నిర్ణయాలే ఇవాళ దేశాన్ని పటిష్ఠంగా నిలబెట్టాయని, ఇలాంటి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లు ఏర్పడ్డాయని కొనియాడారు. దేశం విషయానికి వస్తే నెహ్రూ- సర్దార్ వల్లాభాయ్ పటేల్ జోడీ శాశ్వతంగా నిలిచిపోతుందని రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ విషయంలో మన్మోహన్‌సింగ్, సోనియాగాంధీ పేర్లు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాయని, ఆర్థికంగానే కాదని రాజకీయంగా కూడా దేశం కొన్నాళ్లు సంక్షోభాన్ని ఎదుర్కొన్నదని, దేశం రాజకీయ సంక్షోభంలో ఉన్నప్పుడు మన్మోహన్‌సింగ్ దేశ పగ్గాలు చేపట్టారని వెల్లడించారు. మన్మోహన్‌సింగ్ సరళీకృత ఆర్థికవిధానాల వల్లే ఇలాంటి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లు ఏర్పడ్డాయన్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ దేశం ఆర్థికంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆర్థికమంత్రిగా బాధ్యతలు చేపట్టారని కొనియాడారు. మన్మోహన్‌సింగ్ ఆర్థిక పరిజ్ఞానం తెలిసి పీవీ నర్సింహారావు బాధ్యతలు ఇచ్చారని, మన్మోహన్‌సింగ్‌ను ఎకనమిక్స్ టైమ్స్ ఎకనమిక్ ఫైటర్‌గా వర్ణించిందని గుర్తు చేశారు.

# నైరుతి రుతుపవనాల సీజన్ ముగిసింది

**లోటు వానలతో సమాప్తం**

**చివరలో కొంతమేర ఆదుకున్న వాయుగుండం**

**నేటి నుండి అక్టోబర్ రెండు వరకు మళ్ళీ వేడి గాలులు**

హైదరాబాద్, పవర్ న్యూస్

తెలంగాణలో నైరుతి రుతుపవనాల సీజన్ ముగిసింది. ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు నిరాశే మిగిల్చినా, బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం చివరి రోజుల్లో ఆదుకుంది. గత నాలుగు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కురిసిన విస్తారమైన వర్షాల కారణంగా వర్షపాతం లోటు గణనీయంగా తగ్గింది. సీజన్ మొత్తం మీ ద 20 శాతంగా ఉన్న లోటు, ఈ వర్షాలతో 15 శాతానికి పరిమితమైంది. ప్టెంబర్ 22వ తేదీ వరకు రాష్ట్రంలో 34 శాతం లోటు వర్షపాతం నమోదైంది. అయితే గత నాలుగు రోజుల్లో కురిసిన భారీ వర్షాలతో ఈ నెల లోటు కేవలం 4 శాతానికి పడిపోయింది. ఈ కొద్దిరోజుల్లోనే సగటున 52 మిల్లీమీ టర్ల వర్షపాతం నమోదుకావడం విశేషం. ఈ వర్షాలకు ముందు 18 జిల్లాల్లో లోటు వర్షపాతం ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 14కు తగ్గింది. అయితే, ఏ జిల్లాలోనూ అధిక వర్షపాతం నమోదు కాలేదు. మరోవైపు, భారీ వర్షాల ప్రభావంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. శుక్రవారం సాయంత్రానికి 20.2 అడుగులకు చేరిన ప్రవాహం, నేడు (శనివారం) నాటికి 30 అడుగులకు చేరుకోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో భద్రాద్రి జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ అప్రమత్తం చేశారు. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో 15 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. భూపాలపల్లి జిల్లాలో వర్షపు నీరు గనుల్లోకి చేరడంతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది. వాయుగుండం ప్రభావం ముగియడంతో శనివారం నుంచి రాష్ట్రంలో ఉక్కపోతతో కూడిన వాతావరణం ఉంటుందని వాతావరణ నిపుణులు తెలిపారు. రేపటి (ఆదివారం) నుంచి అక్టోబర్ 2 వరకు రాష్ట్రవ్యాప్తంగా వేడి వాతావరణం ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.



# మెడికల్ కాలేజీ నిర్మాణ స్థలంలో కార్మికుడి మృతి

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 26



జోగుళాంబ గద్వాల జిల్లామెడికల్ కాలేజీ నిర్మాణ పనుల వద్ద పనిచేస్తున్న రజాక్ (26) అనే కార్మికుడు అనుమానస్పదంగా మృతి చెందాడు. చిన్న చింతకుంట మండలం మద్దూర్ కు చెందిన రజాక్ గద్వాల మెడికల్ కాలేజ్ వద్ద నిర్మిస్తున్న భవనం వద్ద కూలిగా పనిచేస్తున్నాడు. గుడిసెలో నివసిస్తున్న రజాక్ శనివారం మృతి చెందాడు. అయితే కుటుంబ సభ్యులకు తెలియకుండానే మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న వివిధ పార్టీల నాయకులు, కార్మిక సంఘాల నాయకులు అక్కడి చేరుకుని పలు అనుమానాలు వ్యక్తం చేశారు. కంపెనీ యాజమాన్యం మరియు సైట్ ఇన్‌ఛార్జ్‌పై కేసు నమోదు చేసి, బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

### కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు

# రంగం సిద్ధం

**మొదటి పేజీ తరువాయి...**

ఎలాంటి రాజీ పడబోదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సహా నిపుణుల కమిటీలు లేవనెత్తిన అభ్యంత రాలను, సూచనలను పరిగణనలోకి తీసుకున్నామని, జాతీయ స్థాయి సాంకేతిక సంస్థల సిఫార్సుల మేరకే పనులు చేపడతామని వెల్లడించారు. ఈ మూడు బ్యారేజీల భద్రతను పటిష్ఠం చేసి, వాటి పూర్తి సామర్థ్యాన్ని పునరుద్ధరించడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని ఆయన ఈ సమావేశంలో నొక్కిచెప్పారు.

# వ్యక్తిగత హాజరు అవసరం లేదు!

**మొదటి పేజీ తరువాయి...**



బూత్ స్థాయి అధికారులతో ఇంటింటి సర్వే చేయిస్తున్నామని తెలిపింది. గల్లంతైన వారిలో ఇప్పటికే 81 మంది ఫారం-6 ద్వారా తిరిగి దరఖాస్తు చేసుకున్నారని గోవా సీఈవో వివరించారు. ఎన్నికల కమిషనర్లు క్యాబినెట్ సెక్రటరీకి రాసిన లేఖపై తలెత్తిన ఊహాగానాలపై కూడా ఈసీ స్పష్టత ఇచ్చింది. సదరు లేఖ ఎన్నికల సంఘానికి డిప్యుటేషన్‌పై వచ్చిన ఒక అధికారి పనితీరుకు సంబంధించినదని, అంతే తప్ప ఈసీ లేదా ఐటీ శాఖల విధానపరమైన అంశాలకు దానికి ఎలాంటి సంబంధం లేదని వివరించింది.



# చాకలి ఐలమ్మ రైతాంగ పోరాట మాతృమూర్తి

**- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

(భూపాలపల్లి టన్ -- పవర్, 26 సెప్టెంబర్ 2026)

తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో చాకలి ఐలమ్మ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఆమె పోరాట స్ఫూర్తి నేటి తరాలకు మార్గదర్శకమని భూపాలపల్లి ఎమ్మెల్యే శ్రీ గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్ఆర్) అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, కలెక్టర్ కార్యాలయం ఐడీసీఎల్‌లో నిర్వహించిన అధికారిక వేడుకల్లో జిల్లా కలెక్టర్ శ్రీ రాహుల్ శర్మతో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్ఆర్) పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి జ్యోతి ప్ర?వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజాం పాలనలో తెలంగాణ రైతులు ఎదుర్కొన్న దోపిడీ, దొరల అణచివేత, బహుజన వర్గాలపై జరిగిన వివక్ష, మహిళలు అనుభవించిన అన్యాయాలకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన మహనీయురాలు చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఆమె పోరాటం కేవలం భూమి కోసం మాత్రమే కాకుండా ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, సమానత్వం కోసం సాగిన మహోన్నత ఉద్యమమని పేర్కొన్నారు. తాము సాగు చేస్తున్న భూములపై హక్కులు సాధించాలనే సంకల్పంతో పేదలు, రైతులు, కూలీలు సంఘటితమై పోరాడిన చారిత్రక సందర్భంలో చాకలి ఐలమ్మ ముందుండి నాయకత్వం వహించి విజయం సాధించిందని ఎమ్మెల్యే తెలిపారు. అణగారిన వర్గాల హక్కుల సాధనలో ఆమె పోషించిన పాత్ర తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చాకలి ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహించడం గర్వకారణమని పేర్కొన్న ఎమ్మెల్యే, ఆమె చూపిన ధైర్యసాహసాలు నేటి యువతకు ఆదర్శమని అన్నారు. సామాజిక న్యాయం, భూ హక్కులు, మహిళా సాధికారత కోసం కృషి చేసే ప్రతి ఒక్కరికీ ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకమని చెప్పారు. చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు రైతాంగ పోరాట స్ఫూర్తిని, మహిళా నాయకత్వ గొప్పతనాన్ని, అణగారిన వర్గాల హక్కుల సాధన గాథలను కొత్త తరాలకు పరిచయం చేస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సామాజిక సమానత్వం, హక్కుల పరిరక్షణ, మహిళా సాధికారత అనే విలువలను గుర్తు చేసే ప్రేరణాత్మక దినోత్సవంగా ఈ జయంతి నిలుస్తుందని అన్నారు.

### తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

**న్యూశాయంపేటలో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యేలు, కలెక్టర్లు**



(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 26)

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా హనుమకొండలోని న్యూశాయంపేటలో ఆమె విగ్రహానికి ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి, వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న కలిసి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ సమాజంలో సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన మహనీయురాలు చాకలి ఐలమ్మ అని అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలపై జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరిస్తూ ఆమె సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భూమి, ఆత్మగౌరవం, సమాన హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని చెప్పారు. సమాజ అభివృద్ధిలో రజకుల పాత్ర కీలకమని, రజక సమాజం అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. చాకలి ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు అర్పించే నిజమైన నివాళి అని తెలిపారు. యువత ఆమె జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజంలో సమానత్వం, న్యాయం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు, సంఘ ప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు

### వరంగల్‌ను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

**క్రీడా రంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట: ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి**



(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 26)

క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించి, గ్రామస్థాయి నుంచే అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ తెలంగాణ స్టేట్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ -- జూనియర్ బాలురు, బాలికలు, పురుషులు, మహిళల విభాగాలతో పాటు ఇండియా యూత్ అండర్-18 సెలెక్షన్ ట్రయల్ క్యాంప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు కేఆర్ నాగరాజు, నగర పోలీస్ కమిషనర్ శ్వేత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, యువతకు ఉపయోగపడేలా, భవిష్యత్తులో ఎంతోమంది క్రీడాకారులను తయారు చేసే విధంగా క్రీడా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ప్రజాప్రతినిధులంతా కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి సమస్యలను తీసుకెళ్లినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి అవసరమైన నిధుల మంజూరుకు తక్షణమే చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. స్టేడియం అభివృద్ధిని కేవలం ఒక క్రీడా మైదానంగా కాకుండా స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేలా సమగ్ర రూపకల్పన చేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. క్రీడాకారులకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, గ్రామస్థాయి నుంచి ప్రతిభను గుర్తించి శిక్షణ, ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడల ద్వారా యువతలో ఆరోగ్యకరమైన జీవన విధానంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని చెప్పారు. విద్య, వైద్యం తర్వాత క్రీడలకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు కల్పించి, ప్రతిభావంతులైన యువతకు అవసరమైన శిక్షణ, వసతులు అందించేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, క్రీడా సంఘాలు సమన్వయంతో పనిచేస్తాయని స్పష్టం చేశారు. క్రీడా రంగంలో ప్రతిభ కనబరుస్తున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని, యువత క్రీడలను తమ భవిష్యత్తుకు బలమైన పునాదిగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అథ్లెటిక్ అసోసియేషన్ సభ్యులు, రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

### పోషణ మాసంతో ఆరోగ్యవంతమైన సమాజం

**అంగన్వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పోషకాహారం అందించాలి: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



(వర్ధన్నపేట -- పవర్, సెప్టెంబర్ 26)

మహిళలు, చిన్నారుల ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న పోషణ మాసం కార్యక్రమంలో వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. వర్ధన్నపేట మండల కేంద్రంలో సీడీపీఓ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పోషకాహారం అందించాలని సూచించారు. చిన్నారులలో రక్తహీనత నివారణ, సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన అలవాట్లపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం గర్భిణులకు శ్రీమంతం నిర్వహించి పండ్లు, పసుపు, కుంకుమ అందజేశారు.

ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్ పర్సన్ పాలకుర్తి సారంగపాణి, పీఏసీఎస్ చైర్మన్ అబ్బిడి రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, టెంపుల్ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శిబారాణి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పోశాల వెంకన్న గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట టౌన్ ప్రెసిడెంట్ ఈగ దామోదర్, మున్సిపాలిటీ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు



## అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులతో నగరానికి మహర్దశ

**కొత్త రోడ్ల పనులకు కొంత విరామం: ఎమ్మెల్యే నాయిని**

(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 26)

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పనులు పూర్తయిన తర్వాతే కొత్త రోడ్ల నిర్మాణ పనులను చేపడతామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం 59వ డివిజన్ పరిధిలోని ఎక్సైజ్ కాలనీలో రూ. 1.05 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో వరంగల్ నగరానికి సమగ్ర అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను తీసుకొస్తున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ తుది దశలో ఉందన్నారు. ప్రస్తుతం రోడ్లు నిర్మించి, కొద్ది నెలలకే డ్రైనేజీ పైప్‌లైన్ల కోసం వాటిని తిరిగి తవ్వాల్సిన పరిస్థితి రాకూడదన్నారు. నగరంలో ఉన్న పాత పైప్‌లైన్ల స్థానంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కొత్త పైప్‌లైన్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. నగరాన్ని దీర్ఘకాలికంగా, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ భారీ ప్రాజెక్టును చేపడుతోందన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తయిన తర్వాత రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. రోడ్డు పనులు పెండింగ్‌లో ఉన్న ప్రాంతాలను గుర్తించి, పనులు పూర్తయ్యాక అన్ని రోడ్లను ఒకేసారి నాణ్యతతో అభివృద్ధి చేద్దామని పేర్కొన్నారు. వేసిన రోడ్లనే మళ్లీ తవ్వాల్సిన పరిస్థితి రాకుండా ప్రజలు కొంతకాలం ఓపిక పట్టాలని, నగర భవిష్యత్ అభివృద్ధి కోసం ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే నాయిని కోరారు.

### గూడూరు జయశ్రీ కుటుంబానికి అండగా ఉంటాం

**బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తాం: ఐద్వా అధ్యక్షురాలు రమాదేవి**



(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 26)

అత్త మీరాబాయితో వేధింపులకు గురై బలవంతంగా ఇంట్లో బంధించబడిన గూడూరు జయశ్రీ కుటుంబానికి అండగా ఉంటామని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు మాదరాజు రమాదేవి స్పష్టం చేశారు. హన్మకొండ రాంనగర్‌లో అత్త మీరాబాయి వల్ల ఇంట్లో బంధించబడిన జయశ్రీ ఆందోళన ఐదవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా శనివారం ఐద్వా మరియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంఘటన స్థలాన్ని సందర్శించి బాధితురాలు గూడూరు జయశ్రీతో పాటు ఆమె కూతురు తేజస్వితో కిటికీలోంచి మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఇంటి ముందు నిరసన దీక్ష చేస్తున్న జయశ్రీ కుమారుడు కార్తీక్‌కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు రమాదేవి మాట్లాడుతూ, ఇంట్లో బంధించడం వలన జయశ్రీతో పాటు ఆమె కూతురు తేజస్వి ఐదు రోజులుగా తిండి, నిద్ర లేక నరకయాతన అనుభవిస్తున్నారని, ఆమెను బంధించిన అత్త మీరాబాయిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పోలీస్ అధికారులను ప్రశ్నించారు. ఈ చర్యలు ముమ్మాటికీ మానవ హక్కుల ఉల్లంఘన కిందకే వస్తాయని అన్నారు. వెంటనే పోలీస్ కమిషనర్ శ్వేత, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దృష్టి సారించి అత్త మీరాబాయిని చట్ట ప్రకారం శిక్షించాలని, గతంలో నోటరీ డాక్యుమెంట్ ద్వారా జయశ్రీ ఆమె పిల్లలకు రాసి ఇచ్చిన ఇల్లుతో పాటు మిగతా ఆస్తులను ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. లేకపోతే ఐద్వాతో పాటు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి మద్దతుగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు అడుప తార, తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సంగెం స్వరూప, జిల్లా నాయకురాలు తాటికొండ సద్గుణ, మహాత్మ జ్యోతిరావు పూలే సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేడల ప్రసాద్ పటేల్, దళిత ప్రజా సంఘం నాయకుడు పోలేపాక సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

### పరకాలలో 100 పడకల ఏరియా ఆసుపత్రి ఓపీ సేవలను ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

(పరకాల -- పవర్, సెప్టెంబర్ 26)

నిరుపేదలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి తెలిపారు. శనివారం పరకాల పట్టణంలో నూతనంగా నిర్మించి అందుబాటులోకి తెచ్చిన 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఓపీ వైద్య సేవలను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి తో కలిసి ఆయన ప్రారంభించారు. అంతకుముందు ఆసుపత్రి ముందు గణపతి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా ఆసుపత్రిలో వైద్యులతో ఆరోగ్య పరీక్షలు చేయించుకుని ఓపీ సేవలను లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఫార్మసీ, జనరల్ వార్డు, గైనకాలజీ, ఏఎన్‌సీ, ల్యాబొరేటరీ తదితర విభాగాలను ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ పరిశీలించి ప్రారంభించారు. ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చిన రోగులకు వైద్యులు వివిధ పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పరకాల పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ ఆసుపత్రి ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చొరవతో పెండింగ్ బిల్లులను మంజూరు చేయించి ఆసుపత్రిని అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రస్తుతం 12 డిపార్ట్‌మెంట్లలో దాదాపు 27 మంది వైద్యులతో వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు.



రాష్ట్ర ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా వైద్యులు, సిబ్బంది 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందినప్పుడే ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని, ప్రైవేట్ ఆసుపత్రులకు ధీటుగా ఆధునిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. వైద్యులు, సిబ్బంది సహకారంతో పరకాల ఏరియా ఆసుపత్రిని ఛాం కేటగిరీకి తీసుకువచ్చేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ పవన్, ఆర్డీవో డీఎస్ వెంకన్న, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వంశీకృష్ణ, పలువురు ప్రజాప్రతినిధులు, వైద్యులు, వైద్య సిబ్బంది, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

---

# జనగామ అభివృద్ధికి రూ.40 కోట్లకు పైగా విలువైన పనులు

### మురుగు నీటి శుద్ధి ప్లాంటు, విద్య, వైద్య మౌలిక వసతుల పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి

(జనగామ -- పవర్, సెప్టెంబర్ 26)

జనగామ జిల్లా అభివృద్ధికి రూ.40 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర గృహ నిర్మాణం, రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం శ్రీకారం చుట్టారు. జనగామ మున్సిపల్ కార్యాలయంలో జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి, పారిశుధ్యం, విద్య, వైద్యం, మౌలిక వసతులకు సంబంధించిన పనులకు శంకుస్థాపనలు చేశారు. జనగామ మున్సిపాలిటీకి రూ.1.77 కోట్ల విలువైన 16 చెత్త సేకరణ ఆటోలు, ఒక జేసీబీని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. మున్సిపాలిటీలో పనిచేసేందుకు ఎంపికైన 30 మంది శానిటరీ వర్కర్లు, 20 మంది డ్రైవర్లు, నలుగురు ఎలక్ట్రీషియన్లు కలిపి మొత్తం 54 మందికి నియామక పత్రాలు అందజేశారు. రూ.2 కోట్లతో చేపట్టనున్న డంపింగ్ యార్డు షెడ్, మెషినరీ పనులకు, రూ.38 కోట్లతో నిర్మించనున్న మురుగు నీటి శుద్ధి ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు.

**తహసీల్దార్ కార్యాలయం మరియు పాఠశాలల్లో అభివృద్ధి పనులు:**

తరిగొప్పుల మండలంలో రూ.2.25 కోట్లతో నిర్మించనున్న తహసీల్దార్ కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేశారు. బచ్చన్నపేట మండలం కట్కూర్ జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలల్లో రూ.38.75 లక్షలతో చేపట్టనున్న మరమ్మతులు, పునరుద్ధరణ పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించారు. పోచన్నపేట ఎంపీపీఎస్‌లో రూ.24 లక్షలు, రామచంద్రాపురం ఎంపీపీఎస్‌లో రూ.23 లక్షలు, జనగామలోని కోర్టు సమీపంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల బాలికల విభాగంలో రూ.20 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలోని 12 కేజీబీవీలు, 15 పీఎం శ్రీ పాఠశాలలు, 28 జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలల్లో రూ.1,92,31,996 వ్యయంతో



అవుట్‌డోర్ బాస్కెట్‌బాల్ కోర్టుల నిర్మాణ పనులను ప్రారంభించారు.

**వైద్య మరియు మౌలిక వసతుల అభివృద్ధి:**

జనగామ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో రూ.19.25 లక్షలతో అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చంపక్ హిల్స్‌లోని మాతా–శిశు ఆసుపత్రిలో రూ.7.35 లక్షలతో ఆక్సిజన్ ప్లాంట్‌కు 50 మీటర్ల సీసీ రోడ్డు, పార్కింగ్ ప్రాంతంలో గ్రావెల్ నింపడం, సెప్టిక్ ట్యాంక్ నుంచి డ్రెయిన్ వరకు పైప్ డ్రెయిన్ ఏర్పాటుకు సంబంధించిన పనులను ప్రారంభించారు. జనగామ ఐడీఓసీ వద్ద రూ.10 లక్షలతో పార్కింగ్ టైల్స్, ఫెన్సింగ్, రూ.31 లక్షలతో కలెక్టరేట్ భవనానికి ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనగామ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థిక సహాయం అందించిన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

(స్టేషన్‌ఘన్‌పూర్ -- పవర్, సెప్టెంబర్ 26)

పేదరికం కారణంగా ఏ ఒక్క ప్రతిభావంతుడైన విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ధర్మసాగర్ మండలం దేవనూర్ గ్రామానికి చెందిన చిట్ర్యాల నితిన్ అనే విద్యార్థి కష్టపడి చదివి ప్రతిష్టాత్మకమైన ఎంబీబీఎస్ సీటు సాధించగా, కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా కళాశాల ఫీజు చెల్లించడం ఆ కుటుంబానికి భారంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు తక్షణమే స్పందించి విద్యార్థికి అండగా నిలిచారు. గతంలో నితిన్ మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ ఫీజును స్వయంగా అందజేసిన శ్రీహరి గారు, తాజాగా రెండో సంవత్సరం చదువు నిమిత్తం రూ. 20,000ల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఎమ్మెల్యే గారి నివాసంలో విద్యార్థికి నగదును అందజేస్తూ నితిన్ ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. సరైన సమయంలో తనకు అండగా నిలిచి, వరుసగా రెండో ఏడాది కూడా ఆర్థిక



సహాయం అందించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారికి నితిన్ మరియు వారి కుటుంబ సభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. శ్రీహరి గారి ప్రోత్సాహం తన ఆశయ సాధనకు మరింత ఊతానిచ్చిందని విద్యార్థి నితిన్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజ్‌గారి రఘు, మాజీ సర్పంచ్ చిర్ర కుమార్, స్థానిక నాయకులు, విద్యార్థి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# చాకలి ఐలమ్మకు ఘన నివాళులు

### వీరవనిత పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం: మాజీ మంత్రి ఎర్రబెల్లి, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

(హైదరాబాద్ -- పవర్, సెప్టెంబర్ 26)

వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. పాలకుర్తి గడ్డ పోరాట స్ఫూర్తిని, తెలంగాణ ప్రజల తెగువను ప్రపంచానికి చాటిచెప్పిన ధీరవనితగా ఐలమ్మ నిలిచారని పేర్కొన్నారు. మహిళా లోకానికి ఆమె పోరాట పటిమ, ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకమని తెలిపారు. చాకలి ఐలమ్మ ఆశయాలు, పోరాట స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి, నేతాని శ్రీనివాస్‌రెడ్డి, సూదాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సత్య శారద



(వరంగల్ -- పవర్, సెప్టెంబర్ 26)

వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సంబంధించి వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ, అవసరమైన పనులను నిర్దేశిత ప్రణాళిక ప్రకారం ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్.కిశోర్ కుమార్, ఆర్డీవో సుమ ఖిలా, వరంగల్ తహశీల్దార్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన నాగుర్ల వెంకటేశ్వర్లు



(హైదరాబాద్ -- పవర్, సెప్టెంబర్ 26)

ఈరోజు హైదరాబాద్‌లోని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రివర్యులు కల్వకుంట్ల తారక రామారావు గారిని రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్, తెలంగాణ ఫర్టిలైజర్ మరియు సీడ్స్ రాష్ట్ర అధ్యక్షులు నాగుర్ల వెంకటేశ్వర్లు గారు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా వారిద్దరి మధ్య పలు సమకాలీన రాజకీయ అంశాలపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ముచ్చటగా మూడోసారి రెడ్ క్రాస్ ఛైర్మన్‌గా డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి ఘన విజయం

(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 26)

మానవతా దృక్పథానికి, నిస్వార్థ సేవలకు మారుపేరుగా నిలిచే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) హనుమకొండ జిల్లా శాఖ అధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నికల్లో ప్రముఖ వైద్యులు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి ఘన విజయం సాధించి, ముచ్చటగా మూడోసారి ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం పట్ల జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా పవర్ దినపత్రిక ప్రత్యేక కథనంగా రెడ్ క్రాస్ సేవలను వివరిస్తోంది. విపత్తులు సంభవించినప్పుడు, అత్యవసర వైద్య సేవలు అవసరమైనప్పుడు రెడ్ క్రాస్ సంస్థ ఎప్పుడూ ముందుంటుంది. ముఖ్యంగా ప్రాణాలను నిలబెట్టే రక్తదాన శిబిరాలు నిర్వహించడంలో, నిరుపేదలకు వైద్య సహాయం అందించడంలో, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు చేపట్టడంలో ఈ సంస్థ విశేషమైన పాత్ర పోషిస్తోంది. డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి నాయకత్వంలో గతంలో అనేక సేవా కార్యక్రమాలు దిగ్విజయంగా నిర్వహించబడ్డాయి. ఇప్పుడు మూడోసారి ఛైర్మన్‌గా ఎన్నికైన తరుణంలో, భవిష్యత్తులో హనుమకొండ జిల్లాలో రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తృతం చేయాలని, యువతను భాగస్వామ్యం చేస్తూ మరిన్ని రక్తదాన శిబిరాలు మరియు సామాజిక సంక్షేమ కార్యక్రమాలను గ్రామ స్థాయికి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సమాజ శ్రేయస్సే ధ్యేయంగా అంకితభావంతో పనిచేస్తున్న డాక్టర్ విజయచందర్ రెడ్డి గారికి పవర్ దినపత్రిక తరపున హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

– ఇర్సడ్ల వంశీకృష్ణ,
పవర్ దినపత్రిక, డిస్ట్రిక్ట్ స్టాఫ్ ప్రతినిధి.



# తెలంగాణలో టెట్ ఫలితాలు విడుదల.. 70.07 శాతం ఉత్తీర్ణత

## టీజీటెట్ ఇన్-సర్వీస్-2026 ఫలితాలు విడుదల
## 22,477 మందిలో 15,749 మంది అర్హత
## పేపర్-1లో 68.76 శాతం మంది పాస్
## గణితం, సైన్స్‌లో 73.60 శాతం ఉత్తీర్ణత
## సోషల్ స్టడీస్‌లో 67 శాతం మంది అర్హత

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ, ఎయిడెడ్, స్థానిక సంస్థల పాఠశాలల్లో పనిచేస్తున్న ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహించిన టీజీటెట్-ఇన్‌సర్వీస్ టీచర్స్-2026 ఫలితాలు విడుదలయ్యాయి. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, టీజీటెట్ ఛైర్‌పర్సన్ శనివారం ఫలితాలను విడుదల చేశారు.

జులై 21న విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం సెప్టెంబర్ 8, 9 తేదీల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) నిర్వహించారు. మూడు విడతల్లో ఆన్‌లైన్ పరీక్షలు జరిగాయి. మొత్తం 24,986 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 22,477 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 15,749 మంది అర్హత సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా 70.07 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

పేపర్-1లో 4,942 మంది పరీక్షకు హాజరుకాగా.. 3,398 మంది (68.76%) అర్హత సాధించారు.

పేపర్-2 గణితం, సైన్స్ విభాగంలో 9,131 మంది పరీక్ష రాశారు. వీరిలో 6,720 మంది (73.60%) ఉత్తీర్ణులయ్యారు.

పేపర్-2 సోషల్ స్టడీస్‌లో 8,404 మంది పరీక్షకు హాజరుకాగా.. 5,631 మంది (67%) అర్హత సాధించారు. అభ్యర్థులు తమ ఫలితాలతో పాటు మార్కుల వివరాలను పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సమీపంలోని మీ-సేవ కేంద్రాల్లోనూ మార్కుల వివరాలను పొందవచ్చని విద్యాశాఖ అధికారులు తెలిపారు.





## ది ప్యారడైజ్ రికార్డు

- నాని కెరీర్‌లో ఫాస్టెస్ట్ ₹100 కోట్ల సినిమా
- కేవలం రెండు రోజుల్లోనే వంద కోట్ల క్లబ్‌లోకి

న్యాచురల్ స్టార్ నాని నటించిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. తొలి రోజుతో పాటు రెండో రోజు కూడా భారీ వసూళ్లు సాధిస్తూ థియేటర్లలో కాసుల వర్షం కురిపిస్తోంది. శ్రీకాంత్ ఒదెల దర్శకత్వంలో ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ చిత్రం కేవలం రెండు రోజుల్లోనే రూ.100 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటినట్లు చిత్ర బృందం వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటివరకు రూ.114 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లుసాధించినట్లు మేకర్స్ పేర్కొన్నారు. దీంతో



నాని కెరీర్‌లోనే అత్యంత వేగంగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన చిత్రంగా 'ది ప్యారడైజ్' నిలిచిందని చిత్ర బృందం తెలిపింది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర భాషల్లోనూ సినిమాకు మంచి స్పందన వస్తున్నట్లు పేర్కొంది. తమిళ, కన్నడ మార్కెట్లతో పాటు హిందీ బెల్ట్‌లోనూ 'ది ప్యారడైజ్'కు ఆదరణ లభిస్తుండటంతో థియేట్రికల్ రన్ జోరుగా కొనసాగుతోంది. ఓవర్సీస్‌లోనూ సినిమా వసూళ్లు చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్నాయని మేకర్స్ చెబుతున్నారు. ముఖ్యంగా నార్త్ అమెరికాలో ఇప్పటికే 1.7 మిలియన్ డాలర్ల గ్రాస్‌ను దాటినట్లు వెల్లడించారు. త్వరలోనే 2 మిలియన్ డాలర్ల మార్క్‌ను అందుకునే దిశగా సినిమా సాగుతున్నట్లుతెలిపారు.మూడోరోజుఅడ్వాన్స్ బుకింగ్స్ కూడా ఆశాజనకంగా ఉండటంతో రాబోయే వారాంతంలో వసూళ్లు మరింత పెరిగే అవకాశం ఉందని చిత్ర బృందం అంచనా వేస్తోంది. ప్రస్తుతం 'ది ప్యారడైజ్' కలెక్షన్లపై టాలీవుడ్‌లో ఆసక్తి నెలకొంది.

## నాతో డ్యాన్స్‌కు నో చెప్పావా

- నన్ను ఎందుకు తొక్కుస్తున్నావు
- ఫరియా అబ్దుల్లాతో మెగాస్టార్ చిరంజీవి



సందీప్ కిషన్ సిగ్మా ప్రీ రిలీజ్ ఈవెంట్ లో మెగాస్టార్

చిరంజీవి చేసిన ఒక సరదా కామెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. యంగ్ హీరోయిన్ ఫరియా అబ్దుల్లాతో స్టేజ్ మీద మాట్లాడుతూ నన్ను తొక్కేయాలని చూస్తున్నావా అని చిరు వేసిన సెటైర్ మామూలుగా పేలలేదు. పైకి ఇది ఫరియాను ఆటపట్టించడానికి అన్నట్టుగా కనిపిస్తున్నా దీని వెనుక నెట్టింట నడిచే ఒక పెద్ద ట్రెండ్ ఉందనే విషయం నెటిజన్లకు ఇట్టే కనెక్ట్ అయింది. గత కొన్నేళ్లుగా ఆన్లైన్ లో ఏదైనా చిన్న సినిమా ఫ్లాప్ అయినా, లేక ఏ నటుడు గ్యాప్ తీసుకున్నా వెంటనే బాస్ తొక్కేశాడు అంటూ కామెంట్స్ రావడం ఒక కామన్ ట్రెండ్ గా మారింది. కావాలనే ఒక వర్గం సరదా కోసం ఈ మీమ్స్ క్రియేట్ చేస్తుంటారు. ఇలాంటి కామెంట్స్ చేసే వాళ్లకు కూడా తెలుసు అందులో ఎలాంటి వాస్తవం లేదని, కేవలం అదొక టైమ్ పాస్ ట్రోలింగ్ అని. అయితే ఇక్కడ అందరినీ ఆశ్చర్యపరిచిన విషయం ఏంటంటే బాస్ అన్నీ గమనిస్తున్నాడు. సోషల్ మీడియాలో నడిచే ఇంత చిన్న ట్రోలింగ్ పదాన్ని కూడా చిరంజీవి ఫాలో అవుతున్నాడనే విషయం సిగ్మా ఈవెంట్ సాక్షిగా అందరికీ అర్థమైంది. తన మీద వచ్చే మీమ్స్, నెగిటివ్ టాగ్స్ ను ఆయన ఎంత క్లోజ్ గా అబ్జర్వ్ చేస్తారో ఈ ఒక్క డైలాగ్ తో జనాలకు భలే క్లారిటీ వచ్చేసింది.. ఈవెంట్ లో ఫరియాతో తనకున్న డాన్స్ ఎక్స్పీరియన్స్ ను పంచుకున్న చిరు, విశ్వంభర సినిమాలో ఫరియాతో డాన్స్ చేసే ఛాన్స్ ఎందుకు రాలేదని నవ్వుతూ అడిగారు. ఇద్దరి మధ్య హైట్ ప్రాబ్లమ్ అయితే తాను ప్రత్యేకంగా హీల్స్ వేసుకునేవాడిని కదా అంటూ హుషారుగా మాట్లాడారు. ఆ ఫ్లోలోనే నన్ను ఎందుకు అవాయిడ్ చేశావు, నన్ను తొక్కేయాలని చూస్తున్నావేమో అనుకున్నాను అని చిరు అనగానే స్టేజ్ మొత్తం నవ్వులతో దద్దరిల్లింది.





## కయాదు లోహర్‌కు డ్రాగన్‌తో బిగ్ బ్రేక్..

### టాలీవుడ్‌లో వరుస ఆఫర్లు

నార్త్ ఇండియా బ్యూటీ కయాదు లోహర్ సౌత్ ఇండియాలో హీరోయిన్‌గా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. 2021లో కన్నడ చిత్రం 'ముగిల్ పేట్'తో సినీ రంగ ప్రవేశం చేసిన ఆమెకు తొలి సినిమాతో ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదు. అయినప్పటికీ మలయాళం, తెలుగు చిత్రాల్లో అవకాశాలు దక్కించుకుంది. 2022లో 'అల్లూరి' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. అయితే ఆ సినిమా కూడా పెద్దగా విజయాన్ని అందుకోకపోవడంతో అవకాశాలు తగ్గాయి. సౌత్‌లో అవకాశాలు తగ్గిన సమయంలో మరాఠీ చిత్రంలో నటించిన కయాదుకు అక్కడా ఆశించిన ఫలితం దక్కలేదు. దీంతో 2024లో ఆమె నుంచి ఒక్క సినిమా కూడా ప్రేక్షకుల ముందుకు రాలేదు. 2025లో 'డ్రాగన్' సినిమాతో వచ్చిన కయాదుకు ఈ చిత్రం మంచి గుర్తింపును తీసుకొచ్చింది. అప్పటి వరకు పలు సినిమాల్లో నటించినా రాని క్రేజ్.. 'డ్రాగన్'తో ఒక్కసారిగా వచ్చింది. ఈ విజయంతో కయాదుకు వరుస ఆఫర్లు వచ్చాయి. దాదాపు పది సినిమాలకు ఆమె కమిట్ అయినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. టాలీవుడ్‌లో 'ఫంకీ' సినిమాతో రీఎంట్రీ ఇచ్చినా ఆ చిత్రం ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేదు. అయినప్పటికీ నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్'లోఅవకాశందక్కించుకోవడంతోకయాదుకెరీర్‌లోమరోకీలక ఛాన్స్ వచ్చినట్లైంది. ప్రస్తుతం వచ్చిన అవకాశాల్లో తనకు సరిపోయే కథలను ఎంపిక చేసుకుంటూ కెరీర్‌ను బలంగా నిర్మించుకునే ప్రయత్నంలో ఉంది.

## ప్రియాంక గుర్రపు స్వారీ

### వైరల్‌గా ఫొటోలు

సీరియల్ నటి ప్రియాంక జైన్ సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటుంది. తనకు సంబంధించిన వ్యక్తిగత విషయాలతో పాటు వెకేషన్, ఫొటోషూట్‌లకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది. తాజాగా గుర్రపు స్వారీ చేస్తూ దిగిన ఫొటోలను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ ఫొటోల్లో ప్రియాంక జైన్ గుర్రంపై స్వారీ చేస్తూ కనిపించింది. గుర్రపు స్వారీని ఆస్వాదిస్తున్నట్లుగా కనిపించిన ఆమె.. ఆ అనుభవానికి సంబంధించిన ఫొటోలను అభిమానులతో పంచుకుంది. సాధారణంగా తన గ్లామర్ ఫొటోలు, ట్రావెల్ అప్‌డేట్స్‌తో ఆకట్టుకునే ప్రియాంక.. ఈసారి గుర్రపు స్వారీ ఫొటోలతో సందడి చేసింది. ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ చేసిన కొద్దిసేపటికే వైరల్‌గా మారాయి. అభిమానులు, నెటిజన్లు ఫొటోలను చూసి ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రియాంక జైన్‌కు గుర్రపు స్వారీ కూడా బాగా సూట్ అయిందంటూ కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.



## సిగ్మాలో కేథరిన్ ఐటెం సాంగ్

### 'సులోచనా' అంటూ మాస్ స్టెప్పులు

సందీప్ కిషన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'సిగ్మా' సినిమాపై ఇప్పటికే మంచి హైప్ నెలకొంది. విజయ్ దళపతి కుమారుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. తాజాగా విడుదలైన 'సులోచనా' స్పెషల్ సాంగ్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పాటలో కేథరిన్ థ్రెసా స్పెషల్ అప్పియరెన్స్ ఇచ్చారు. ఎనర్జిటిక్ బీట్‌కు ఆమె వేసిన మాస్ స్టెప్పులు, స్క్రీన్‌పై కనిపించిన గ్లామర్ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. సినిమా కథ, యాక్షన్ అంశాలతోపాటు కమర్షియల్ టచ్ ఉండేలా ఈ పాటను రూపొందించినట్లు తెలుస్తోంది. ఈ పాటకు ఎస్.ఎస్. తమన్ సంగీతం అందించగా.. శృతి రంజని ఆలపించారు. కృష్ణచైతన్య సాహిత్యం అందించారు. తమన్ అందించిన ఎనర్జిటిక్ బీట్‌కు అనుగుణంగా డ్యాన్స్ మూమెంట్స్‌ను డిజైన్ చేశారు. సందీప్ కిషన్ సినిమాల్లోని కమర్షియల్ ఎలిమెంట్స్‌కు తగ్గట్టుగా 'సులోచనా' పాటను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు.